
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 27 అక్టోబరు 2025



అతను తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే చిన్న ఉద్యోగి కంప్యూటర్ ఆపరేటర్. కానీ ఆయన చేసే పనులన్నీ పెద్దవే. తహసీల్దార్ చేతిలో ఉండాల్సిన డిజిటల్ కీ అతడి చేతిలో ఉంది. దీంతో విలువైన ప్రభుత్వ స్థలాలకు అక్రమంగా పొసెషన్ సర్టిఫికెట్లు జారీ చేశాడు. దీంతో అతడికి పెద్దఎత్తున ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీఆర్‌వో, ఆర్‌ఐ, సర్వేయర్‌ల విచారణ లేకుండానే అతను తహసీల్దార్ లాగిన్ నుంచే దాదాపు 25 పొసెషన్ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు రెవెన్యూ అధికారులే చెబుతున్నారు.

అడ్డంగా ఇచ్చేశారు...

- విలువైన ప్రభుత్వ స్థలాలకు పొసెషన్ సర్టిఫికెట్లు
- మూడు నెలలుగా ఆపరేటర్ చేతిలో డిజిటల్ కీ
- పట్టించుకోని తహసీల్దార్
- లోన్ వెరిఫికేషన్‌తో అక్రమాలు బయటికి
- జాయింట్ కలెక్టర్, రాజంపేట సబ్ కలెక్టర్ దృష్టికి అక్రమాలు



సుండుపల్లె తహసీల్దార్ కార్యాలయం



సుండుపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలో ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండాపోయింది. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. అక్రమంగా పొసెషన్ సర్టిఫికెట్లు సృష్టించి విలువైన స్థలాలను అమ్ముకున్నారు. కొంతమంది వైసీపీ కీలక నాయకులు మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాలను జగనన్న కాలనీ పేరిట లేఅవుట్ వేసి వైసీపీ నాయకులకు కట్టబెట్టారు. ఆ ప్రభుత్వంలో అలా జరిగితే ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న వ్యక్తులు ప్రభుత్వ స్థలాలను, వ్యవసాయ భూములకు అక్రమంగా పట్టాలు సృష్టించి అక్రమంగా సంపాదిస్తున్నారు. 5 నెలల క్రితం దొంగ పాసుపుస్తకాలు సృష్టించి రైతుల వద్ద నుంచి వేలాది రూపాయలు ఓ ప్రైవేటు వ్యక్తి వసూలు చేసి జైలుకెళ్లాడు. ఆ ఘటన మరువకముందే తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే ఓ చిన్న ఉద్యోగి తహసీల్దార్ మహబూబ్‌చాంద్ డిజిటల్ కీ వాడుకుని మండల వ్యాప్తంగా పలు గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ స్థలాలకు పొసెషన్ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆ సర్టిఫికెట్ల ఆధారంగా రిజిస్ట్రేషన్‌లు కూడా జరిగాయి. గుట్టలు, వాగులు, వంకలు, గ్రామ కంఠంలలో ఇష్టారాజ్యంగా ముడుపులు తీసుకుని తహసీల్దార్ డిజిటల్ కీ వాడుకుని పొసెషన్ జారీ చేయడం చూస్తే ఆ శాఖలో పని చేసే అధికారులే ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రస్తుతం సుమారు 25కు పైగా పొసిషన్ సర్టిఫికెట్లు జారీ అయినట్లు సమాచారం. తహసీల్దార్ డిజిటల్ కీ వినియోగించుకుని ఇంకెన్ని అక్రమాలు చేశారో లోతుగా విచారిస్తే బయటపడే అవకాశాలు ఉన్నాయి.

తహసీల్దార్ డిజిటల్ కీ తోనే అక్రమాలు


ఒక పొసెషన్ సర్టిఫికెట్ జారీ చేయాలంటే సచివాలయంలో లేదా మీసేవలో అప్లికేషన్ నమోదు చేసే దగ్గర నుంచి వీఆర్‌వో లాగిన్, ఆర్‌ఐ లాగిన్, సర్వేయర్ స్కెచ్‌తో సహా బదిలీ అయిన తహసీల్దార్ లాగిన్‌కు వెళితే అప్పుడు తహసీల్దార్ విచారించి పొసెషన్ సర్టిఫికెట్ అప్రూవల్ చేయాలి. కానీ సుండుపల్లెలో జరిగిన అక్రమాలు అన్నీ డైరెక్ట్‌గా వీఆర్‌వో, ఆర్‌ఐ, సర్వేయర్ ప్రమేయం లేకుండా డైరెక్ట్‌గా తహసీల్దార్ డిజిటల్ కీతో అప్రూవల్ చేయడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు పొందాలంటేనే అన్ని నియమాలు పాటిస్తే గానీ చేయని అధికారులు ఇన్ని పొసెషన్ సర్టిఫికెట్లు జారీ అవుతుంటే పట్టించుకోకపోవడం ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇన్ని రోజులుగా ఒక వ్యక్తి డిజిటల్ కీ వినియోగిస్తూ ఉంటే ఏం జరుగుతోంది అనే విషయాన్ని తహసీల్దార్ పట్టించుకోకపోవడం ఏమిటని విమర్శలు వస్తున్నాయి.

లోన్ ప్రయత్నాలతో అక్రమాలు బట్టబయలు

పొసెషన్ సర్టిఫికెట్లు అడ్డుపెట్టుకుని లోన్ల కోసం కొంతమంది చేసిన ప్రయత్నాలతో అక్రమాలు బట్టబయలయ్యాయి. కొన్ని పొసెషన్ సర్టిఫికెట్లు జారీ చేశారు. కానీ జారీ చేసిన సర్వే నెంబర్‌లో అక్కడ ఖాళీ స్థలాలే లేవని తెలుస్తోంది. ఓ గ్రామ పంచాయతీలో మార్టిగేజ్ చేసుకునే ముందు లోన్ కోసం ఎంక్వయిరీ చేసే వ్యక్తి వెళ్లి ఆ స్థలం పరిశీలించి ఇది ప్రభుత్వ స్థలమా లేదా ప్రైవేటు స్థలమా అని అక్కడి వీఆర్‌వోను విచారించారు. ఆ విచారణలో అది ప్రభుత్వ స్థలమని ఆ స్థలంలో మేము ఎటువంటి పట్టాలు (పొసెషన్ సర్టిఫికెట్) జారీ చేయలేదు అని చెప్పడంతో ఈ అక్రమాలు బయటికి వచ్చాయి. ఈ విషయాన్ని రాజంపేట సబ్ కలెక్టర్ భావన, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌ల దృష్టికి తీసుకెళ్లినట్లు రెవెన్యూ అధికారులు, సిబ్బంది చెబుతున్నారు.

తెర వెనుక బాధ్యులెవరు

మండల కేంద్రంలో, ఇతర గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ స్థలాలు, గ్రామ కంఠంలలో ఇంత ధైర్యంగా కంప్యూటర్ ఆపరేటర్ పొసెషన్ సర్టిఫికెట్లు జారీ చేయడం సాధ్యపడుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత రెవెన్యూ శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది హస్తం ఉందా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో రెండుసార్లు సస్పెండ్ అయ్యి సుండుపల్లెకు వచ్చిన కంప్యూటర్ ఆపరేటర్ చేతికి డిజిటల్ కీ ఇచ్చామని చెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. అన్నీ పక్కాగా చేస్తున్నాము. అనర్హులకు ఒక్క సర్టిఫికెట్ కూడా జారీ చేయలేదని చెబుతున్న అధికారులు ఇన్ని అక్రమాలు జరుగుతుంటే ఇన్ని రోజులు తెలిసినా కూడా మౌనం వహించారా అనేది తేలాల్సి ఉంది. ఇప్పుడు ఏమో డిజిటల్ కీ వినియోగించి కంప్యూటర్ ఆపరేటర్ అక్రమాలు చేసినట్లు మా దృష్టికి వచ్చిందని సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. ఈ వ్యవహారం వెనుక ఆ శాఖలో పనిచేసే ఇతరులు కూడా ఉన్నారా లేదా అనేది ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉంది.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామ-వార్డు సచివాలయ శాఖ
APGSWS AF 1328941
POSSESSION CERTIFICATE
GOVERNMENT OF ANDHRA PRADESH

ప్రభుత్వ స్థలానికి జారీ చేసిన పొసెషన్ సర్టిఫికెట్

కఠిన చర్యలు తీసుకుంటాము



అక్రమంగా పొసెషన్ సర్టిఫికెట్లు జారీ చేసిన విషయం పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాము. రాజంపేట సబ్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటాము. కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేందుకే నా డిజిటల్ కీ ఇచ్చాను.

- మహబూబ్‌చాంద్, తహసీల్దార్, సుండుపల్లె

29న సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితర అధికారులు

చిన్నమండెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 29వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన కోసం జిల్లా యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఆదివారం ఉదయం నుంచి జిల్లా యంత్రాంగం మొత్తం ముఖ్యమంత్రి ఏర్పాట్లను పరిశీలిస్తూ ట్రాఫిక్ భద్రతా అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్డీవో శ్రీనివాసులు, చిన్నమండెం తహసీల్దార్ నరసింహులు ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాలోని ఉన్నతాధికారులంతా అక్కడే ఉండి హెలిప్యాడ్, బహిరంగ సభ ప్రదేశాలను చదును చేయిస్తున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ఉన్నతాధికారులు తెలిపారు.

బస్సుల తనిఖీల్లో 59 కేసుల నమోదు

- జిల్లా రవాణా శాఖాధికారి ప్రసాద్



బస్సుల తనిఖీలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రవాణా కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో రెండు రోజులుగా కాంట్రాక్ట్ క్యారేజీ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ ఆదివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా రవాణా శాఖాధికారి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా మొత్తం 59 కేసులు నమోదు చేసి సుమారు రూ.1,54,100 జరిమానా విధించినట్లు ఆయన చెప్పారు. నమోదైన కేసుల వివరాల్లో అగ్నిమాపక పరికరం లేకపోవడం, ప్రథమ చికిత్స పెట్టె లేకపోవడం, ప్రయాణికుల జాబితా నిర్వహించకపోవడం, అధిక చార్జీలు వసూలు చేయడం, ఎక్కువ వెలుతురుతో లైట్లు ఉపయోగించడం, అనుమతి పత్రం (పర్మిట్) లేకపోవడం మొదలైన కేసులు నమోదు చేశామని, ఈ డ్రైవ్ మరికొన్ని రోజులు కొనసాగుతుందని ఆయన తెలిపారు.

మైలవరానికి 5 వేల క్యూసెక్కుల నీరు విడుదల

కొండాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి ఆదివారం సాయంత్రం నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టులోకి జీఎన్‌ఎస్‌ఎస్ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, పెన్నానది ద్వారా వెయ్యి క్యూసెక్కులు, వరద నీరు మరో 500 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నట్లు ఈఈ తెలిపారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 26.553 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

నకిలీ మద్యం కేసులో తండ్రీ కొడుకు అరెస్టు

- నకిలీ మద్యం తయారీకి స్పిరిట్ పంపిణీ
- నిందితులకు 14 రోజుల రిమాండ్... మదనపల్లె సబ్‌జైలుకు తరలింపు
- ఎనిమిది సెల్‌ఫోన్లతో పాటు రెండు కార్లు, నాలుగు ల్యాప్‌టాప్‌లు స్వాధీనం


నిందితులు బాలాజీ, సుదర్శన్‌లను జైలుకు తరలిస్తున్న పోలీసులు

రాయచోటి/ములకలచెరువు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నకిలీ మద్యం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రధాన నిందితుడు జనార్దన్‌రావుతో చేతులు కలిసి నకిలీ మద్యం తయారీ ఫార్ములా అమలు చేసి స్పిరిట్ రవాణా చేసిన బెంగళూరు బొమ్మనహళ్లికి చెందిన బాలాజీ, అతడి కుమారుడు సుదర్శన్‌ను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఆదివారం ఉదయం తంబళ్లపల్లె కోర్టులో హాజరుపర్చగా జడ్జి వారికి 14 రోజులు రిమాండ్ విధించారు. అనంతరం ఇద్దరినీ మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. ఈ సందర్భంగా నిందితుల నుంచి రెండు కార్లు, నాలుగు ల్యాప్‌టాప్‌లు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బాలాజీ బెంగళూరులోని పలు డిస్టిలరీల్లో పనిచేశాడు. అనంతరం గోవాకు తన మకాం మార్చాడు. సుదీర్ఘకాలం పాటు డిస్టలరీల్లో పనిచేయడంతో మద్యం తయారీలో ఉపయోగించే ఫార్ములాలను పసిగట్టాడు. డిస్టలరీల నుంచి బయటకు వచ్చి గోవాలో లిక్కర్ హబ్‌లను నిర్వహించే స్థాయికి ఎదిగాడు. ములకలచెరువుతో పాటు ఇబ్రహీంపట్నంలో తన సొంత ఫార్ములాను ఉపయోగించి నకిలీ మద్యం ఎలా తయారు చేయాలన్న దానిపై స్వయంగా కూలీలకు శిక్షణ ఇచ్చాడు.

గోవాలో కలిసిన చేతులు..

బాలాజీ అరెస్టుతో కీలక విషయాలు బయటపడ్డాయి. బాలాజీ, అతడి కుమారుడు సుదర్శన్ రిమాండు రిపోర్టులో పేర్కొన్న ప్రకారం.. ఈ కేసులో ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు, బాలాజీలు గోవాలో చేతులు కలిసి నకిలీ మద్యం తయారీని ప్రారంభించారు. గోవాలోని కలింగర్ ప్రాంతంలో 2010 సంవత్సరం నుంచి లీజుకు తీసుకున్న మద్యం వ్యాపారం కొవిడ్ కారణంగా దెబ్బతిందని, 2023లో ఇబ్రహీంపట్నంకు చెందిన అద్దేపల్లి జనార్దన్‌రావు గోవాలోని తన మద్యం దుకాణానికి రావడంతో పరిచయం ఏర్పడిందని బాలాజీ తెలిపాడు. ఇబ్రహీంపట్నంలో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్ వల్ల ఆర్థికంగా నష్టపోతున్నానని, నకిలీ మద్యం తయారు చేయడానికి తనకు సహాయం చేయాలని జనార్దన్‌రావు అడగడంతో అంగీకరించినట్లు తెలిపారు. గోవాలో తనకు తెలిసిన జినేస్ అనే వ్యక్తి స్పిరిట్‌ను సేకరించి బెంగళూరుకు పంపడంతో నిల్వ చేశానని, 2023 నుంచి బెంగళూరు నుంచి తిరుపతి, నెల్లూరు మీదుగా విజయవాడకు స్పిరిట్ రవాణా చేసి ఇబ్రహీంపట్నంలోని జనార్దన్‌రావు సోదరుడు జగన్మోహన్‌రావు, కట్టా రాజు, సయ్యద్ హాజీలకు అప్పగించేవాడినని తెలిపాడు. స్పిరిట్ నుంచి నకిలీ మద్యం తయారు చేసే విధానాన్ని జనార్దన్‌రావు, అతడి తమ్ముడు జగన్మోహన్‌రావులకు వివరించానని, బెంగళూరులోని కుమార్ ద్వారా నకిలీ లేబుల్స్ సేకరించి పంపినట్లు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ములకలచెరువులో నకిలీ మద్యం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జనార్దన్‌రావు చెప్పడంతో బెంగళూరు నుంచి స్పిరిట్, ముడి పదార్థాలు రవాణా చేసినట్లు తెలిపాడు. గుజరాత్‌కు చెందిన వాలరం, అతడి కుమారుడు శరవణ ద్వారా బాటిళ్ల మూతలు కొనుగోలు చేసి, నకిరేకంటి రవి నుంచి గోవాలో ముద్రించిన లేబుళ్లు సేకరించినట్లు తెలిపారు. తమిళనాడుకు చెందిన నలుగురు, ఒరిస్సాకు చెందిన ఇద్దరు వ్యక్తులకు, కట్టా రాజు, సయ్యద్‌హాజీలకు నకిలీ మద్యం తయారీ పద్ధతిని నేర్పించానని, తన కుమారుడు సుదర్శన్‌కు కూడా నకిలీ మద్యం తయారీ గురించి తెలుసని వివరించాడు. అధిక లాభాలు ఆర్జించాలని జనార్దన్‌రావుతో చేతులు కలిపి నకిలీ మద్యం తయారీలో కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. సుదర్శన్ వాంగ్మూలం ప్రకారం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం చేస్తున్న తాను తన తండ్రి సూచనల మేరకు ఇబ్రహీంపట్నం, ములకలచెరువులో నకిలీ మద్యం తయారీకి సంబంధించి నగదు లావాదేవీలు చూసేవాడినని తెలిపాడు. తాను ఎప్పుడూ ఇబ్రహీంపట్నం వెళ్లలేదని, ములకలచెరువుకు వచ్చి నకిలీ మద్యం తయారు చేయడాన్ని గమనించినట్లు తెలిపాడు.

గుజరాత్‌లోనూ నకిలీ మద్యం లింకులు

ములకలచెరువు, ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం లింకులు గుజరాత్‌కు వ్యాపించాయి. ఇప్పటికే మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో లింకులు వెలుగు చూసిన విషయం తెలిసిందే. మూతలు, బాటిళ్ల గుజరాత్‌కు చెందిన వారి వద్ద కొనుగోలు చేసినట్లు బాలాజీ వాంగ్మూలం ఇవ్వడంతో ఆ దిశగా ఎక్సైజ్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి..నకిలీ బాటిళ్ల మూతలు పంపిన ఇద్దరు వ్యక్తుల గురించి ఆరా తీస్తున్నారు.

23 మంది నిందితులు...19 మంది అరెస్టు

నకిలీ మద్యం కేసులో ఇప్పటి వరకు మొత్తం 23 మంది నిందితులు ఉండగా ఎక్సైజ్ పోలీసులు 19 మందిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు జనార్దన్‌రావుతో పాటు మరో 18 మంది రిమాండ్‌లో ఉన్నారు. కేసులో మిగిలిన నిందితులైన దాసరిపల్లి జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది మంత్రి గిరిధర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్, జయచంద్రారెడ్డి ఇంట్లో పనిచేసే అన్బురాసు అలియాస్ బాబు అరెస్టు కావాల్సి ఉంది. వీరి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి

ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన

- ఓపెన్‌హౌస్‌ను ప్రారంభించిన ఎస్పీ


ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఓపెన్‌హౌస్‌ను ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదివారం ప్రారంభించారు. ఆదివారం పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఓపెన్‌హౌస్‌లో ఆయుధాలను తిలకించి వాటి పనితీరు గురించి తెలుసుకున్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్‌లో 303 తుపాకీ, 7.62 ఎంఎం సెల్ఫ్ లోడింగ్ రైఫిల్, 9 ఎంఎం పిస్టల్, ఏకే 47, టియర్ గ్యాస్ గన్‌తో పాటు ఇతర పరికరాలు, రైట్ గేర్ ఎక్విప్‌మెంట్, బీపీ జాకెట్‌లను ప్రదర్శించి ఏఆర్ సిబ్బంది వాటి పనితీరును వివరించారు. అలాగే కేసుల ఛేదనలో ఉపయోగించే సాంకేతికత, బాడీవార్న్ కెమెరాలు, వేలిముద్రల సేకరణ, కమ్యూనికేషన్ వ్యవస్థల గురించి వివరించారు. శక్తి టీం సభ్యులు మహిళలు, అమ్మాయిల భద్రత కోసం శక్తియాప్ ప్రాముఖ్యత, ఈవ్‌టీజింగ్‌పై తీసుకుంటున్న చర్యలను బృందాలు వివరించాయి. 26, 27వ తేదీల్లో రెండు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులందరికీ ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని రాయచోటి, మదనపల్లి, రాజంపేట సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లలో కూడా ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛా నదిలో చిక్కుకున్న యువకుడు

- వంతెన దాటుతూ నదిలో పడిపోయిన వైనం
- కాపాడిన గ్రామస్థులు, అధికారులు


పింఛా నది ప్రవాహం నుంచి కార్తీక్‌ను సురక్షితంగా బయటకు తీసుకువస్తున్న పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులు

పీలేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ కొళ్లఫారం గ్రామానికి చెందిన కార్తీక్ (17) శనివారం రాత్రి తన అమ్మమ్మ గారి ఊరైన పీలేరు మండలం నాలేవాండ్లపల్లెకు వచ్చాడు. స్వగ్రామానికి తిరిగి వెళ్లేందుకు ఆదివారం ఉదయం 5.30 గంటలకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని నూనేవాండ్లపల్లె వద్ద పింఛా నదిపై ఉన్న వంతెను దాటాల్సి ఉంది. పింఛా ఉధృతిని అంచనా వేయలేకపోయిన కార్తీక్ తన ద్విచక్ర వాహనంపై నదిని దాటే ప్రయత్నం చేశాడు. బ్రిడ్జి మధ్యలోకి వెళ్లే సరికి నీటి ప్రవాహానికి ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో అతను నదిలో పడిపోయాడు. అయితే ద్విచక్ర వాహనాన్ని ఆసరాగా చేసుకుని అతను తనకు జరిగిన ప్రమాదాన్ని సెల్‌ఫోన్ ద్వారా నాలేవాండ్లపల్లెలోని తన బంధువులకు తెలియజేశాడు. వారు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు ప్రవాహ ఉధృతికి దాదాపు 50 మీటర్లు కొట్టుకుపోయాడు. వారు వెంటనే పోలీసులు, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. తాను బ్రిడ్జికి కొద్ది దూరంలో బండను ఆసరాగా చేసుకుని నిలబడి ఉన్నట్లు కార్తీక్ సెల్‌ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. పీలేరు తహసీల్దారు శివకుమార్, అర్బన్ సీఐ యుగంధర్, అగ్నిమాపక శాఖాధికారి భాస్కర రెడ్డి నేతృత్వంలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. మూడు గంటలపాటు నీటి ప్రవాహం మధ్యలో బిక్కుబిక్కుమంటూ గడిపిన ఆ యువకుడు బతుకు జీవుడా అంటూ అయిన వాళ్ల వద్దకు చేరాడు. కాగా గతంలో అదే బ్రిడ్జిపై నుంచి పడిన ఓ జంట పింఛా నదిలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు.

14 తుఫాను సహాయ కంట్రోల్ రూంలు

కలికిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథాన్ తుఫాను ప్రభావిత ప్రాంతాల ప్రజల కోసం మదనపల్లె డివిజన్‌లో 14 సహాయ కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. ఆదివారం నుంచి కంట్రోల్ రూముల్లో అధికారులు అందుబాటులోకి వచ్చారు. ప్రతి కంట్రోల్ రూంకు ముగ్గురేసి అధికారులను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. ఆయా మండలాల ప్రజలు తుఫాను కారణంగా తలెత్తే విపత్తులను వెంటనే ఈ కంట్రోల్ రూంలోని అధికారులను సంప్రదించవచ్చు. 24 గంటలపాటు ఇక్కడ అధికార్లు అందుబాటులో ఉంటారు. మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో (08571 231181), మదనపల్లె డీఎస్పీ కార్యాలయంలో (91548 77503), మదనపల్లె మున్సిపల్ కార్యాలయంలో (08571 222280), మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో (91215 11504), కురబలకోట (96667 61520), పెద్దమండెం (94910 77058), పీటీఎం (94916 75670), తంబళ్లపల్లె (79898 33068), ములకలచెరువు (98669 48533), బి.కొత్తకోట (94418 87096), కలికిరి (94412 19987), వాల్మీకిపురం (98660 46879), రామసముద్రం (96768 57690), నిమ్మనపల్లె (94910 77054) నెంబర్లతో కంట్రోల్ రూంలు ఏర్పాటయ్యాయి. తుఫాను సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించడానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు పర్యవేక్షణాధికారిగా పీఎస్ గిరీషాను ప్రభుత్వం నియమించింది. గతంలో గిరీషా అన్నమయ్య జిల్లా కలెక్టరుగా, ఉమ్మడి చిత్తూరు జిల్లా జేసీగా, తిరుపతి కార్పొరేషన్ కమిషనరుగా పనిచేశారు.

గుంజనేరు పరివాహక ప్రాంతాల్లో తుఫాను భయం!

• ప్రతి ఏటా కూలుతున్న ఇళ్లు • రక్షణగోడ నిర్మించాలని డిమాండ్



గుంజనేరులో ప్రవహిస్తున్న నీరు

రైల్వేకోడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వస్తోందంటే చాలు గుంజనేరు, ముష్టేరు, మేకలగుంతేరు, గుండాలేరు పరివాహక ప్రాంతాల్లోని ప్రజల్లో ఆందోళన మొదలవుతుంది. తుఫాన్ హెచ్చరికలతో ఇప్పటికే భయం మొదలైంది. రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని నరసరాంపేట, ధర్మాపురం, చిన్నలాలాపేట, గాండ్లవీధి తదితర ప్రాంతాల్లోని నదీ తీరాల్లో ఎన్నో ఏళ్లుగా పేదలు ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు నరసరాంపేటలోని నదీ తీరంలో ఉన్న సుమారు పది ఇళ్లు కూలిపోయాయి. ఈ ప్రాంతంలో నది నుంచి రక్షణకు గోడ నిర్మించాలని ప్రజలు పదే, పదే విన్నవిస్తుండడంతో, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రక్షణ గోడ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అయితే, నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మళ్లీ టెండర్లు పిలిచి ఆ పనులను ప్రారంభించింది. అంతలోనే భారీ వర్షాలకు కురవడంతో పనులు ఆగిపోయాయి. ఇక ధర్మాపురం, చిన్నలాలాపేట, గాండ్లవీధి గ్రామాల్లో నదీతీరంలో సుమారు 300 పేద కుటుంబాలు నివసిస్తున్నాయి. భారీ వర్షాలు కురిసినపుడు అధికారులు ఆయాల ప్రాంతాల ప్రజలను అధికారులు స్థానిక హెచ్ఎంఎం హైస్కూలు, నారాయణ స్కూలు, గౌరీశంకర్ స్కూలు తదితర ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడికి తరలిస్తుంటారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వరద ఉధృతి ఎక్కువైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నట్లు రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ తెలిపారు. ప్రజలు చెరువుల వద్దకు కూడా ప్రజలు వెళ్లవద్దని అధికారులు సూచించారు. చిన్న పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని హెచ్చరించారు.



నరసరాంపేటలో నదీపరివాహక ప్రాంతంలో పేదల ఇళ్లు



గాండ్లవీధి ప్రాంతంలో ప్రవాహం పక్కనే పేదల ఇళ్లు

పేదలకు రక్షణ లేదు



ప్రతి ఏటా ఇళ్లు కూలిపోతున్నాయి. వాటిని కట్టించేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో కూలిపోయిన ఇళ్లలోనే బతుకుతున్నారు. రక్షణ గోడ నిర్మించి ఉంటే మేలు జరిగేది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని రక్షణగోడ పనులు పూర్తి చేయాలి.

- లింగాల యానాదయ్య, నరసరాంపేట

ఇళ్లు ఖాళీ చేయాల్సిందే..



భారీ వర్షాలు వస్తాయంటే ఇళ్లు ఖాళీ చేసి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. వరద తగ్గిన తర్వాత ఇళ్లు శుభ్రం చేసుకుని అందులోనే నివాసముంటున్నాం. మా గోడు ఎవరూ వినిపించుకోవడం లేదు. ఇంటి స్థలాలతో పాటు, పక్కా ఇళ్లను మంజూరు చేయాలని గతంలో విన్నవించాం

- చింతల వెంకటరమణ, నరసరాంపేట

కళావేదిక ఆధ్వర్యంలో శతాధిక కవి సమ్మేళనం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళావేదిక సభ్యులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):వర్ధమాన, నూతన కవులను ప్రోత్సహిస్తూ తెలుగు భాషా సాహిత్యం, సంస్కృతి, బాషా కీర్తి ఇనుమ డింప జేయడానికి కళావేదిక సంస్థ రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, పలు రాష్ట్రాల్లో కార్యక్ర మాలు నిర్వహిస్తున్నట్లు ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముని గోపాలకృష్ణ, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం తెలిపారు. కళావేదిక సంస్థ అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం పర్యవేక్షణలో, అన్నమయ్య జిల్లా కళావేదిక కమిటీ కో ఆర్డినేటర్ జింకల మోహన్‌వల్లి అధ్యక్షతన సొసైటీ కాలనీ, రామాలయంలో ఆదివారం 158వ జాతీయ శతాధిక కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంస్థ వివిధ జిల్లాల్లో 48 గంటలు, 33 గంటల నిరంతర సాహిత్య కార్యక్రమాల ద్వారా కళాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మునిగోపాలకృష్ణ వృద్ధ రక్షిత రక్షత: కవితను చదివి వినిపించారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 150 మంది కవులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అశోక్‌కుమార్, జ్ఞానోదయ ప్రసాదరావు, డాక్టర్ పరందామ గౌడ్, డాక్టర్ పార్థసారథి, శ్రీహరికోటి, కృష్ణవేణి, నరసయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అండర్-19 తైక్వాండో ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ అధికారులు

రైల్వేకోడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీవీఎస్ఆర్ కల్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి అండర్-19 బాల, బాలికల తైక్వాండో ఎంపిక పోటీలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కడప జిల్లా ఎస్‌జీఎఫ్ అధ్యక్షుడు ఎన్వీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆది, సోమవారాల్లో నిర్వహించే ఈ పోటీల్లో 13 జిల్లాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఇక్కడ ఎంపికైన జట్టు త్వరలో జమ్మూలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. సోమవారం ఎంపిక చేసిన జట్టు వివరాలను ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి సి. శారద, చిన్న ఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హరిత, పోటీల పరిశీలకుడు డి.శ్రీనువాసులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఏ. సుబ్బరాజు, ఎస్. విజయ్‌ప్రసాద్‌రెడ్డి, అరుణ, నాగేశ్వర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మురళీకాష్టారెడ్డి,నీలకంఠరావు, సోమశేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అరికెల విద్యార్థిని



విద్యార్థిని పద్మప్రియతో ఉపాధ్యాయులు

రామసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు మండలంలోని అరికెల జడ్పీ హై స్కూల్ పీడీ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురబలకోట మండలం అంగళ్లు జడ్పీ హైస్కూల్‌లో నిర్వ హించిన జిల్లా స్థాయి అండర్-17 బాలికల వాలీబాల్ పోటీలలో అరికెలలో 10వ తరగతి చదువుతున్న పద్మప్రియ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి సెలెక్ట్ అయిందని ఆయన తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలపతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు పద్మప్రియను అభినందించారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న కె.శ్రీహరిరావు

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీహరిరావు డిమాండ్ చేశారు. ఆదివారం కడప బీసీ భవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రమాదాల్లో మృతి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్ల కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం అందించాలని, ఈఎస్ఐ సౌకర్యం, టూల్‌కిట్లు ఇవ్వాలని కోరారు. జనవరి 27ను సర్ థామస్ అల్వా ఎడిసన్ జయంతిగా ఎలక్ట్రికల్ డేగా గుర్తించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పవర్ అల్తాఫ్ ,రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పాలు రాజ్, కార్యదర్శి మాదన్న, గౌరవాధ్యక్షుడు వై.శుక్రరావు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు షేక్ అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి



అజయ్‌కుమార్ మృతదేహం

చిన్నమండెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై కస్తూర్బా స్కూల్ దగ్గర ఆపి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రాయచోటి మండలం ఏజీ గార్డెన్ నివాసి అజయ్‌కుమార్ (19) ఆదివారం బైక్‌పై గుర్రంకొండ నుంచి రాయచోటి వైపు వస్తూ కస్తూర్బా స్కూల్ వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆరుగురు బైకర్ల అరెస్టు



స్వాధీనం చేసుకున్న బైకులతో ఎస్ఐ తిరుపాల్‌నాయక్

వేంపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో బైపాస్‌రోడ్డులో అధిక వేగంతోను, ఒకే చక్రంపై, పెద్ద శబ్దాలను చేస్తూ బైకు నడిపిన ఆరుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరసింహులు, ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. రెండు రోజు లుగా బైపాస్ రోడ్డులో యువకులు హల్‌చల్ చేసిన విషయం పోలీసుల దృష్టికి రావడంతో మూడు బైకులు స్వాధీనం చేసుకొని యువకు లను అరెస్టు చేసినట్లు తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలిగించేలా ద్విచక్ర వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కూలిన మట్టి మిద్దె



కూలిన మట్టిమిద్దె పైకప్పు

వేంపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం జెండా మాను వీధిలో మాబుఖాతున్ అనే మహిళకు చెందిన మట్టిమిద్దె కూలి పో యింది. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు నాని పోయిన మట్టి మిద్దె శనివారం రాత్రిఉన్నట్లుండి కూలిపోయింది. అయితే ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఇంట్లోని వస్తువులు మాత్రమే దెబ్బతిన్నాయి. సుమారు రూ. 50 వేలు నష్టం జరిగినట్లు బాధితురాలు తెలిపారు. ప్రభుత్వం పక్కాగృహం మంజూరు చేయించాలని కోరారు.

చెరువుల పరిశీలన

• మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు



యర్రబల్లె చెరువును పరిశీలిస్తున్న ఆర్డీఓ చిన్నయ్య

పులివెందుల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య చెరువులను, కుంటలను పరిశీలించారు. ఆదివారం పులివెందుల మండలంలోని యర్రబల్లె చెరువును పరిశీలించారు. తుఫాన్ ప్రభావం పెరిగితే ప్రజలకు పునరావాసం కల్పించేందుకు పులివెందులలోని న్యాక్ భవనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో ఎవరూ ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ కడప జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించారన్నారు. మట్టిమిద్దెలు, పెద్ద పెద్దచెట్ల కింద, వాగులు,వంకలు, నదులు, చెరువులకు దిగువన నివాసం ఉండరాదన్నారు. గండి క్షేత్రం ఎదురుగా ఉన్న పాపాఘ్ని నదిలోకి భక్తులు వెళ్లరాదన్నారు. ,లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణుల విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పైడిపాళెం, సర్వరాయసాగర్ తదితర ప్రాజెక్టుల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైన సమస్య ఉత్పన్నమైతే మరమ్మతులు చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలంలో తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే లింగాల మండలంలో జూనియర్ అసిస్టెంట్ సతీష్ మొబైల్ నెంబర్ (9493778390), వీఆర్వో నాగార్జున (77990770084), పులివెందుల వాసులు ఆర్ఐ షెక్షావలి (995177271) వీఆర్వో శ్రీనివాసరెడ్డి (8978811567), చక్రాయపేట మండల వాసులు ఆర్ఐ గురుబాబు (798909766), వీఆర్వో మధుసూధన్‌రెడ్డి (9849722607), వేములవాసులు ఏఎస్ఓ మల్లికార్జున (8328289319), వీఆర్వో ఎర్రస్వామి (820082425), సింహాద్రిపురం మండల ప్రజలు వీఆర్వో నిరంజన్‌కుమార్ (6302545306), ఆపరేటర్ మల్లిక్ (8328509819), తొండూరు మండలవాసులు సీనియర్ అసిస్టెంట్ కుమారి (7569150977), వీఆర్వో ప్రభాకర్‌రెడ్డి (8328505068), వేంపల్లె మండల ప్రజలు వీఆర్వో ఓబయ్య (99590706523), వీఆర్వో రవీంద్రనాథ్ రెడ్డి (9703739557), వీరపునాయునిపల్లెలో ఎలక్షన్ ఆపరేటర్ బాష (9160709639), వీఆర్వో దొరబాబు (7702553857)కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. పులివెందుల ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ చిన్నయ్య (9849904111), రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగేంద్ర (8919134718) నెంబర్లలో 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 24 గంటలూ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

నిండు కుండలా ఝురికోన

• ప్రాజెక్టుకు చేరుతున్న 50 క్యూసెక్కుల వరద నీరు

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఝురికోన ప్రాజెక్టు ఇటీవల కురిసిన వర్షాలకు నిండుకుండను తలపిస్తోంది. ప్రాజెక్టులోకి 50 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని, అలుగు పారుతుండడంతో 50 క్యూసెక్కుల నీరు దిగువ ప్రాంతానికి వెళుతున్నట్లు తెలియజేశారు. బాహుదా నది పైభాగంలో వర్షాలు బాగా కురవడంతో వర్షపు నీరు ఝురికోన ప్రాజెక్టుకు చేరుతోంది. సంబేపల్లె, సుండుపల్లె, కేవీ పల్లి మండల రైతుల జీవన సాగునీటి ప్రాజెక్టు ఝురికోన. బాహుదా నదిపై 0.5 టీఎంసీల సామర్థ్యంతో 2008-09లో ఝురికోన ప్రాజెక్టును సంబేపల్లె మండలం వల్లబండపల్లి సమీప ప్రాంతంలో నిర్మించారు. ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నా ఒక ఎకరాకు కూడా సాగునీటి సౌకర్యం కల్పించలేదు. కేవీపల్లి, కలకడ, పీలేరు ప్రాంతాల్లో గ్రావిటీ ద్వారా తాగునీటిని మాత్రం వినియోగించుకుంటున్నారు. మూడు మండలాల రైతులకు సాగునీరు సంబేపల్లె, చిన్నమండెం మండలాలకు తాగునీరే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. కానీ అది మాత్రం నెరవేరలేదు. ఇప్పటికైనా ప్రాజెక్టు ఆశయం నెరవేరేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



ప్రాజెక్టు నిండి అలుగు పారుతున్న దృశ్యం

తెలుగుబిడ్డల ఆరాధ్యుడు ఎన్టీఆర్





ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు సుధాకర్‌యాదవ్, గల్లా మాధవీ

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తెలుగు బిడ్డల ఆరాధ్య దైవం స్వర్గీయ డాక్టర్ నందమూరి తారకరామారావు అని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధా కర్‌యాదవ్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మాధవిఅన్నారు. ఆదివారం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాకతీయ కమ్మవారి అన్నదాన సత్రంలో డాక్టర్ నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు ప్రజల కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించి బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడు తూ ప్రసాద పథకం కింద దేవస్థానం అభివృద్ధికి రూ.150 కోట్లు డీపీఆర్‌ను కేంద్రానికి పంపించడం జరిగిందన్నారు. రాబోవు నాలుగైదు సంవత్సరాల్లో బిమఠం మండల రూపు రేఖలు మారనున్నాయన్నారు. ముఖ్యంగా కాలజ్ఞాన కర్త శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. దేవస్థా నం పరిధిలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం పట్ల కాకతీయ కమ్మవారి అన్నదానసత్ర కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు 1984 సంవత్సరంలో ఏర్పాటు చేయడయం జరిగిం దన్నారు. అనంతరం కమిటీ సభ్యులు గుంటూరు ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్యే పుట్టాను శాలువా పూలమాలలతో కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఎల్లటూరు సాంబశివారెడ్డి, టీడీపీ యువ నాయకుడు కాణాల మల్లిఖార్జునరెడ్డి, కమిటీ సభ్యులు చేరెడ్డి గద్దె కాశయ్య, చేరెడ్డి పేరయ్య, గాలి పాపారావు, ఎల్ఐసీ అంజిబాబు, అంజయ్య రమణయ్య, వెంకటేశ్వర్లు, కేశవరావు, పుల్లారా వుతో పాటు కమిటీ సభ్యులు, కమ్మ సంఘం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉధృతంగా బాహుదా నది ప్రవాహం

• పలు గ్రామాలకు రాకపోకలు బంద్



ఉధృతంగా ప్రవహిస్తున్న బాహుదా నది

కలకడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బాహుదా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కలకడ నుంచి పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. మండలంతో సహా కలికిరి, కేవీపల్లి పరిధిలో ఉన్న బాహుదా నది ఉధృతంగా ప్రవహి స్తోంది. అధికారుల ఆదేశాలతో పాపిరెడ్డిగారిపల్లి-మహల్, కలకడ-తువ్వపల్లితో పలు నది ప్రవహిస్తున్న మార్గాలను ముందు జాగ్రత్త చర్యగా రెవెన్యూ అధికారులు మూసివేశారు. ప్రజలు గ్రామాలకు చేరుకునేందుకు ప్రత్యామ్నాయ రోడ్ల ద్వారా ప్రయాణం సాగిస్తున్నారు. రైతులు పొలాల వద్దకు చేరుకోవడానికి, పాడి రైతులు పశుగ్రాసం కోసం అవస్థలు పడుతున్నారు.

పాపాఘ్ని నదిలోకి వెళ్లవద్దు - డీఎస్పీ



పాపాఘ్ని నదిలో జెండాలు పాతి హెచ్చరిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

వేంపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్, భారీ వర్షాల నేపథ్యంలో పాపాఘ్ని నదిలోకి ఎవరూ వెళ్లవద్దని పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ హెచ్చరించారు. వేంపల్లె పాపాఘ్ని నది వద్ద ఉన్న పలు రహదారుల్లో ఎర్రజెండాలను పాతించారు. పాపాఘ్ని నదిలోకి వెళ్లవద్దని బ్యానర్లు ఏర్పాటుచేశారు. గుంతలు ఉన్నాయి పెద్దలు,పిల్లలు ఎవరు వెళ్లిన ప్రమాదం జరుగుతుందని డీఎస్పీ హెచ్చరించారు. సీఐ నరసింహులు, ఎస్ఐ తిరుపాల్ నాయక్ ఉన్నారు.

'మొంథా'ను సమర్థవంతంగా ఎదుర్కొందాం

● ముందస్తు చర్యలు ప్రారంభించిన అధికారులు ● ఊటుకూరు చెరువు వద్ద వెయ్యి బస్తాల ఇసుక మూటలు ఏర్పాటు ● నదుల వద్ద హెచ్చరిక బోర్డులు ● తుఫానుపై ప్రజలకు అవగాహన





రాజంపేట: ఊటుకూరు చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఇసుక బస్తాలు... బాలరాజుపల్లె వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన దృశ్యం

రాజంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను తీవ్రత దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు అయినా ఎదుర్కోవడానికి ప్రభుత్వ అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. కలెక్టర్ స్వయంగా శనివారం రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో ముందస్తు సహాయ చర్యలపై రాజంపేట సబ్‌కలెక్టర్ భావనతో పాటు సంబంధిత మండల అధికారులతో సమీక్షించారు. అన్ని మండల కేంద్రాల్లో ఆయా సచివాలయాల పరిధిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి ప్రజలకు ఫోన్ నంబర్లు అందజేశారు. రాజంపేట, కోడూరు ప్రాంతాల్లోని చెయ్యేరు, గుంజనేరు, పుల్లంగేరు, పాములేరు తదితర అన్ని నదీ పరివాహక ప్రాంతాల్లో ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ నదుల్లోకి వెళ్లరాదని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రధానంగా రాయచోటి, రాజంపేట రోడ్డులోని బాలరాజుపల్లె, నందలూరు, గుండ్లూరు ప్రాంతాల్లో గ్రామ కార్యదర్శి నరసింహులు ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రాజంపేట పట్టణానికి ఎగువ ప్రాంతంలో ఉండే ఊటుకూరు చెరువుకు గండ్లుపడే అవకాశం ఉన్నందున ఆ గ్రామ చెరువు సంఘ అధ్యక్షుడు నామా హరి ఆధ్వర్యంలో సుమారు వెయ్యి ఇసుక బస్తాలను చెరువు వద్ద ఏర్పాటు చేశారు. చెరువుకట్ట గండ్లుపడే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు.

చిట్వేలి: మొంథా తుఫానుతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిట్వేలి పంచాయతీ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పంచాయతీ అధికారులు చిట్వేలి వీధుల్లో ప్రజలకు మైకుల ద్వారా అవగాహన కల్పించారు. కలెక్టర్ ఆదేశానుసారం తుఫాను ప్రభావం విశాఖ పట్టణం నుంచి తిరుపతి వరకు రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువులు, కాలువలు, లోతట్టు ప్రాంతాల వద్దకు ఎవరూ వెళ్లరాదన్నారు. పశువులు, ఇతర జంతువులను సురక్ష ప్రాంతాలకు అధికారులు సూచించారు. ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తుఫాను ప్రభావం తీవ్రంగా ఉందని, ప్రజలు అప్రమత్తంతో మెలగాలన్నారు.

కంట్రోల్ రూమ్ 24 గంటలు అందుబాటులో...

రాయచోటి(నేతాజీ సర్కిల్): జిల్లాలో తుఫాన్ పరిస్థితుల కారణంగా సంబేపల్లె కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు అందుబాటులో ఉండేలా ఉద్యోగులకు విధులు కేటాయించినట్లు తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు, సర్వేయర్లుతో పాటు ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండేలా విధులను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఒంటిమిట్ట: భారీ వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు దామోదర్‌రెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుజాతమ్మలు మండల అధికారులు సమావేశం నిర్వహించారు. ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.

సిద్ధవటం: భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌యాదవ్ తెలిపారు. ఏదైనా విపత్తు జరిగితే టీడీపీ కార్యకర్తలు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు.

గాలివీడు: తుఫాను నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్‌ 9000177535కు ఫోన్ చేయాలని ఆమె పేర్కొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : రైతులు పొలాలకు వెళ్లకూడదని లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ అధికారి రాజకుమారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాలు ఎక్కువుగా వచ్చి పొలాలు గండిపతున్నాయని పొలాల వద్దకు వెళ్లకూడదన్నారు.

కాలువకు గండికొట్టిన వారిపై చర్యలు తప్పవు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): వెలిగల్లు ప్రాజెక్టు ప్రధాన కాలువ లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు కుడికాలువ ద్వారా నీరు విడుదల చేశామని, గండి కొట్టిన వారిపై కఠిన చర్యలు తప్పవని వెలిగల్లు ప్రాజెక్టు డీఈ ప్రతాప్ హెచ్చరించారు. లక్కిరెడ్డిపల్లెలోని నందివాండ్లపల్లె కాలువ వద్ద కుడికాలువకు గండికొట్టారని రైతులు, సీపీఐ నాయకులు సిద్దిగాళ్ల శ్రీనివాసులు డీఈకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు రెండు మండలాలకు నింపుతామని 2 వేల ఎకరాలకుపైగా నీరు అందిస్తామన్నారు.

మానవతా సేవలు విస్తృతంగా చేపట్టండి

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున అందిస్తున్న మానవతా సేవలు విస్తృతం చేయాలని కడప జిల్లా అధ్యక్షుడు యర్రపురెడ్డి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక నలంద హైస్కూల్‌లో మానవతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదలకు ఆర్థిక సాయాన్ని, బాడీ ఫ్రిజ్ మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. మానవత మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి, రాయచోటి ఆత్మీయ సహకార చైర్మన్ వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షులు పక్కీరయ్య, కన్వీనర్ శివయ్య, సెక్రటరీ వీర నాగిరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, చైతన్యరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాళహస్తి ఆలయ బోర్డు డైరెక్టర్‌కు శుభాకాంక్షలు

నందలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంఘ నాయకుడు, పారిశ్రామిక వేత్త పెనగలూరు(ట్రాన్స్‌ఫార్మర్) శ్రీనివాసులు సతీమణి పెనగలూరు హేమావతి శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు మెంబరుగా ఎంపికై ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. నందలూరుకు చెందిన ప్రముఖ నాయకులు హాజరై పూలమాల, శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, లయన్ మన్యం, రామ్మోహన్, బీసీ నాయకులు తాటి సుబ్బరాయుడు, అరవ వెంకటేశ్ పాల్గొన్నారు.

వీఆర్వోకు తీవ్ర గాయాలు

ఓబులవారిపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వీఆర్వో పెంచలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. పాములేరు వద్ద ఓ లారీ వెనుక నుంచి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రైవేటు అంబులెన్స్ యజమాని శేఖర్ అనే వ్యక్తి పెంచలయ్యను గుర్తించి రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన వైద్య బృందం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలి

రైల్వేకోడూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాన కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వం పునఃప్రారంభించాలని రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పడాల రమణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మాదరాజు గంగాధర్ తెలిపారు. ఆదివారం భవన నిర్మాణ సంఘ అధ్యక్షుడు పాండురంగయ్య ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించే జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక నాయకులు భాస్కర్, నరసింహులు, హరి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మానసాదేవి విగ్రహ ప్రతిష్ఠ

సిద్ధవటం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కనుమలోపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన మానసాదేవి ఆలయంలో ఆదివారం మానసాదేవి అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. బ్రహ్మంగారి మఠం తోటపల్లి అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి పలు విశిష్టమైన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతి విరజానందస్వామి మాట్లాడుతూ శాంతి స్వరూపిణి మానసాదేవి అమ్మవారిని పూజిస్తే అనుగ్రహం తప్పక లభిస్తుందన్నారు. ఆలయ ధర్మకర్త లక్షుమయ్య, నిత్యపూజేశ్వరాలయ ఇన్‌చార్జి ఈవో శ్రీధర్, పలువురు పీఠాధిపతులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అధికారులకు గుంత కనపడలేదా..?

రాయచోటిటౌన్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి):రాయచోటి కొత్తపేట జగదాంబ సెంటర్‌లో ఏర్పడిన గుంత మున్సిపల్ అధికారులకు కనపడలేదా అని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి ప్రశ్నించారు. ఆదివారం ఆయన ఆ గుంతను చూపుతూ మాట్లాడారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి



వెంకటస్వామికి నివాళులర్పిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రామాపురం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాచపల్లి గ్రామం వడ్డెపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త కుంచపు వెంకటస్వామికి రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి నివాళులర్పించారు. ఆయన వెంట మండల, గ్రామ టీడీపీ నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.

వైసీపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

● మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): వైసీపీ బలోపేతానికి కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, హిందూపురం పరిశీలకుడు రమేశ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం శెట్టిపల్లి మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రారెడ్డి స్వగృహంలో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో ధైర్యంగా ఎదుర్కొని కష్టపడి పనిచేసే వారికే పదవులు ఇస్తామన్నారు. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేయకుండా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టి వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అందజేసి ప్రజా వ్యతిరేకతను రాష్ట్ర గవర్నర్‌కు తెలియజేస్తామన్నారు.

వైసీపీ నాయకుల దొంగాట: టీడీపీ

రాయచోటిటౌన్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలను జగన్‌మోహన్‌రెడ్డి కేవలం పునాది స్థాయిలోనే వదిలేసి నేడు కోటి సంతకాల పేరుతో రాష్ట్ర మంతటా వైసీపీ నాయకులు దొంగ నాటకాలు ఆడుతున్నారని గాజుల ఖాదర్‌బాషా ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం వల్ల నాణ్యమైన ఉచిత వైద్యం అందిస్తే వైసీపీ నాయకులకు ఎందుకింత బాధో అర్థం కావడం లేదన్నారు. పేద విద్యార్థులకు అదనంగా 110 సీట్లు వస్తాయని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, శివారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిండిన గంగల చెరువు



గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న తహసీల్దారు

ఒంటిమిట్ట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న కొత్తపల్లె సమీపంలో ఉన్న గంగలచెరువు నిండి అలుగు పొర్లింది. చెరువు నిండి అలుగు పారడంతో తహసీల్దార్ దామోదర్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు సంవత్సరాల తర్వాత చెరువు నిండడంతో ఇబ్రహీంపేట, చిన్న కొత్తపల్లి, గంగపేరూరు, రాచగుడిపల్లె రైతుల్లో ఆనందం వెల్లి విరిసింది. టీడీపీ మాజీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, చెరువు సంఘం అధ్యక్షుడు కట్టా వెంకటరమణ, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, వీఆర్వో నిఖిత, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వర్షంతో దెబ్బతిన్న పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

నందలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారి శివనారాయాణ, రాజంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు శివశంకర్‌తో కలిసి మండలంలో వర్షంతో దెబ్బతిన్న వరి పంటను ఆదివారం పరిశీలించారు. నందలూరు గ్రామంలో కె.గణపతి సాగు చేసి దెబ్బతిన్న జగిత్యాలు, చిట్టిముత్యాల వరి రకాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు రాబోయే మూడు, నాలుగు రోజులు వ్యవసాయ సిబ్బంది వారి హెడ్‌క్వార్టర్లలో రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. పంటనష్ట వివరాలను పక్కాగా సేకరించాలని ఆదేశించారు. పంటకోసిన రైతులు వరి కుప్పల మీద ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటను వారం రోజుల పాటు వాయిదా వేసుకోవాలని సూచించారు. పంటపొలంలో నీరు నిల్వ ఉంటే ప్రత్యేక కాలువల ద్వారా నీటిని బయటకు పంపాలన్నారు. వర్షాలు ఆగిన తర్వాత పంట మీద హెక్సాకానిజోల్ అనే మందులు పిచికారీ చేసి వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయాధికారి బి.మల్లికార్జున, వ్యవసాయశాఖ సిబ్బంది శిల్ప, భరత్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

పెనగలూరు: వర్షాలకు తడిసిపోయిన వరిపంటను ఆదివారం సాయంత్రం జిల్లా వ్యవసాయాధికారి కె.శివనారాయణ కోమంత రాజపురం, నారాయణనెల్లూరు గ్రామాల్లో పరిశీలించారు. రాజంపేట, రైల్వేకోడూరు ఏడీఏలు కె.శివశంకర్, ఎస్.మణి, పెనగలూరు ఏవో సుబ్రమణ్యం, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేద్దాం

● మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కోకన్వీనర్

రాయచోటిటౌన్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వర్కర్స్ నవంబరు 3 నుంచి చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కోకన్వీనర్ నేలపాటి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో పారిశుధ్య కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ మరణించిన, రిటైర్డ్ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను ఔట్‌సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకురావాలన్నారు. 12వ పీఆర్‌సీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి మధ్యంతర భృతి 30 శాతం ఇవ్వాలని, 2011 నుంచి జనగణన జరగనందున, ప్రాంతాల విస్తీర్ణం పెరిగినందున ఆయా మున్సిపల్ కార్పొరేషన్, నగర పంచాయతీల్లో పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. డైలీ వేస్ కార్మికులను అవుట్‌సోర్సింగ్‌లోకి తీసుకోవాలని, పర్మినెంట్ కార్మికుల పెండింగ్ బకాయిలు సత్వరం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కేశవరావు, శేషాద్రిబాబు, హరి, కృష్ణయ్య, రవి, సుజాత, రజినీ, యశోద తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు 12వ పీఆర్‌సీని ప్రకటించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ్రాజ్యం

రాయచోటి టౌన్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు 12వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ్రాజ్యం డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపల్ యూనియన్ మహాసభ సందర్భంగా కార్మికులు రాయచోటి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు, హరినాథవీధి మీదుగా ప్రీతం కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సామ్రాజ్యం సీఐటీయూ జెండాను ఆవిష్కరించి కార్మికులకు సంతాపం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల మలమూత్రాలను శుభ్రం చేస్తూ మున్సిపల్ కార్మికులు అనేక వ్యాధులకు గురవుతున్నా ప్రభుత్వం కనీస వేతనం గానీ, పీఆర్‌సీ గానీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. నవంబర్‌లో జరిగే రాష్ట్ర మహాసభకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు ఏవీ రమణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రామచంద్ర, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, శంకరయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలపు హామీలు అమలు చేయాలన్నారు. రాయచోటి, మదనపల్లి, బీ.కొత్తపేట, రాజంపేట మున్సిపాలిటీల నుండి పెద్ద ఎత్తున మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

సమాచార రంగంలో అరుదైన గౌరవం

● ధర్మానాయక్‌ను సన్మానించిన గ్రామస్థులు



ధర్మానాయక్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు, కుటుంబీకులు

సుండుపల్లె, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సమాచార రంగంలో ధర్మానాయక్‌కు అరుదైన గౌరవం లభించిందని గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు విశ్వనాథ్ నాయక్ తెలిపారు. ఆదివారం మండలంలోని భాగంపల్లి గ్రామ పంచాయతీ కుప్పగుట్టలో గ్రామస్థులు, కుటుంబీకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ ఆఫీసులో కర్తవ్యనిష్ఠతో విధులు నిర్వహించి బదిలీపై విజయవాడ దూరదర్శన్ కేంద్రం న్యూస్ ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించడం సంతోషదాయకం అన్నారు. మారుమూల సుండుపల్లె మండలంలో ఓ దిన పత్రికలో పాత్రికేయుడిగా ప్రస్థానం ప్రారంభించి జర్నలిజం చేసి నేడు రాష్ట్ర స్థాయిలో రాణించడం పట్ల కుటుంబీకులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్థులు కేక్ తినిపించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామునాయక్, బాలునాయక్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నీలకంఠ్రావుపేట పెద్దచెరువుకు నీరు

రామాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సమీపంలో మేదరపల్లి ఆనుకొని ఉన్న ఈర్లకుంట అలుగు నుంచి నీలకంఠ్రావుపేట పెద్దచెరువుకు నీటిని మళ్లించినట్లు తహసీల్దార్ వెంకటేశులు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాలకొండల నుంచి భారీగా నీరు రావడంతో గుండ్లకుంట, ఈర్లకుంట చెరువులకు నీరు చేరి చెరువులు పూర్తిగా నిండాయన్నారు. మంత్రి ఆదేశాల మేరకు నీలకంఠ్రావుపేట పెద్దచెరువుకు టీడీపీ నాయకుల సహకారంతో ఆదివారం ఈర్లకుంట అలుగు నుంచి నీరందించినట్లు తెలిపారు. తహసీల్దార్ వెంకటేశులు, ఇరిగేషన్ ఏఈ మహబూబ్‌బాషా, టీడీపీ నాయకులు కొరివి ధనుంజయ, గంజికుంట నాగరాజా, చిట్టిరెడ్డి, తిమ్మారెడ్డి, కొరివి చిన్నవెంకటయ్య, రాము పాల్గొన్నారు.

పోలీసు పిల్లలకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

రాయచోటిటౌన్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఏఆర్ డీఎస్పీ ఎం. శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం రాయచోటి పట్టణంలోని డైట్ కళాశాలలో పోలీసు పిల్లలకు, సిబ్బందికి వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ వీజే రామకృష్ణ, ఆర్ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, అధ్యాపకులు నరసింహారెడ్డి, గిరిధర్, వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, మోహన్‌నాయక్, రెడ్డెప్పరెడ్డి, శివభాస్కర్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

రాజంపేట టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : తుఫాను హెచ్చరికల దృష్ట్యా పశువులకు ఎటువంటి అంటువ్యాధులు రాకుండా ములక్కాయలపల్లె, నారపురెడ్డిపల్లె, కారంపల్లె, ఉప్పరపల్లె ప్రాంతాల్లో పశువైద్యులు ముందస్తుగా టీకాలు వేశారు. రాజంపేట పశువైద్య సహాయ సంచాలకులు కె.ప్రతాప్ ఆధ్వర్యంలో పలు పశువులకు టీకా మందులు వేసి రైతులకు తగు సూచనలు అందజేశారు.



పేకాట రాయుళ్లు అరెస్ట్

నందలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ తోటపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయం వెనుకాల ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు రాబడిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురు పేకాటరాయుళ్లను, ఐదు సెల్‌ఫోన్లను, రూ.3500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కంటి రోగులకు ఆపరేషన్లు

రాయచోటిటౌన్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లి గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 14 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి, రాజంపేట, పీలేరు నియోజకవర్గంలోని కేవీపల్లి, ఎర్రావారిపాలెం, కలకడ, కలికిరి, గుర్రంకొండ, చక్రాయపేట నుంచి వచ్చిన 25 మందికి పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 14 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఓబులవారిపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 28న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయరావు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యులు అలాగే అన్నిశాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా పవన్‌సాయి

రైల్వేకోడూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా యువత ఎగ్జిక్యూటీవ్ సభ్యులు గా రైల్వేకోడూరుకు చెందిన మండల పవన్‌సాయిని ఎంపిక చేసినట్లు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనువాసులు ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా పవన్‌సాయి తనకు ఇచ్చిన ఈ పదవి మరింత బాధ్యత పెంచిందన్నారు. యువత రాజకీయలోకి రావాలని వైసీపీ ఇచ్చిన పిలుపు మేరకు తనకు ఈ పదవిని పార్టీ కట్టబెట్టిందన్నారు. నియోజకవర్గంలో వైసీపీని బలోపేతం చేస్తామని తెలిపారు.

వందశాతం ఈకేవైసీ పూర్తి చేస్తాం

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో వంద శాతం ఈకేవైసీ పూర్తి చేస్తామని ఉపాధి హామీ ఏపీవో రెడ్డి జవహర్ తెలిపారు. మండల వ్యాప్తంగా జాబుకార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

కోడూరుకు చేరుకున్న రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ సిబ్బంది

రైల్వేకోడూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికతో ఆదివారం ముందస్తు చర్యగా విపత్తుల నివారణ సంస్థ సిబ్బంది (ఎస్‌డీఆర్‌ఎఫ్) రైల్వేకోడూరుకు చేరుకుంది. రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్, సిబ్బంది కలిసి ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం వరద ప్రాంతాలను పరిశీలించింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నార్జాల హేమరాజ్, పోతురాజు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే దేవుడు మృకుండ మల్లేశ్వరుడు

ఒంటిమిట్ట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసిన మృకుండ మల్లేశ్వరస్వామి భక్తుల కోర్కెలు తీర్చడంతో పాటు రోగాలు నయం చేసే దేవుడుగా నిత్యం పూజలు అందుకుంటున్నాడు ఒంటిమిట్ట నుంచి కిలోమీటరు దూరంలో ఈ ఆలయం ఉంది.

వైభవంగా కార్తీక మాస ఉత్సవాలు

మృకుండ మల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీమాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం. ప్రతి సోమవారం వేకువజామునే స్వామివారికి అభిషేకం వైభవంగా నిర్వహిస్తారు.

కళావేదిక ఆధ్వర్యంలో శతాధిక కవి సమ్మేళనం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళావేదిక సభ్యులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):వర్ధమాన, నూతన కవులను ప్రోత్సహిస్తూ తెలుగు బాషా సాహిత్యం, సంస్కృతి, బాషా కీర్తి ఇనుమడింప జేయడానికి కళావేదిక సంస్థ రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, పలు రాష్ట్రాల్లో కార్యక్ర మాలు నిర్వహిస్తున్నట్లు ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముని గోపాలకృష్ణ, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం తెలిపారు. కళావేదిక సంస్థ అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం పర్యవేక్షణలో, అన్నమయ్య జిల్లా కళావేదిక కమిటీ కో ఆర్డినేటర్ జింకల మోహన్‌వల్లి అధ్యక్షతన సొసైటీ కాలనీ, రామాలయంలో ఆదివారం 158వ జాతీయ శతాధిక కవిసమ్మేళనం నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంస్థ వివిధ జిల్లాల్లో 48 గంటలు, 33 గంటల నిరంతర సాహిత్య కార్యక్రమాల ద్వారా కళా కారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మునిగోపాలకృష్ణ వృద్ధీ రక్షిత రక్షత: కవితను చదివి వినిపించారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 150 మంది కవులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అశోక్‌కుమార్, జ్ఞానోదయ ప్రసాదరావు, డాక్టర్ వరందామ గౌడ్, డాక్టర్ పార్థసారథి, శ్రీహరికోటి, కృష్ణవేణి, నరసయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అండర్-19 తైక్వాండో ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ అధికారులు

రైల్వేకోడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీవీ ఎస్ఆర్ కల్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి అండర్-19 బాల, బాలికల తైక్వాండో ఎంపిక పోటీలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కడప జిల్లా ఎస్‌జీఎఫ్ అధ్యక్షుడు ఎన్‌వీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆది, సోమవారాల్లో నిర్వహించే ఈ పోటీల్లో 13 జిల్లాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఇక్కడ ఎంపికైన జట్టు త్వరలో జమ్మూలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. సోమవారం ఎంపిక చేసిన జట్టు వివరాలను ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి సి. శారద, చిన్న ఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హరిత, పోటీల పరిశీలకుడు డి.శ్రీనువాసులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఏ. సుబ్బరాజు, ఎస్. విజయ్‌ప్రసాద్‌రెడ్డి, అరుణ, నాగేశ్వర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మురళీకాష్టారెడ్డి,నీలకంఠరావు, సోమశేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అరికెల విద్యార్థిని



విద్యార్థిని పద్మప్రియతో ఉపాధ్యాయులు

రామసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు మండలంలోని అరికెల జడ్పీ హై స్కూల్ పీడీ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురబలకోట మండలం అంగళ్లు జడ్పీ హైస్కూల్‌లో నిర్వ హించిన జిల్లా స్థాయి అండర్-17 బాలికల వాలీబాల్ పోటీలలో అరికెలలో 10వ తరగతి చదువుతున్న పద్మప్రియ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి సెలెక్ట్ అయిందని ఆయన తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలపతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు పద్మప్రియను అభినందించారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న కె.శ్రీహరిరావు

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీహరిరావు డిమాండ్ చేశారు. ఆదివారం కడప బీసీ భవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రమాదాల్లో మృతి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్ల కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం అందించాలని, ఈఎస్ఐ సౌకర్యం, టూల్‌కిట్లు ఇవ్వాలని కోరారు. జనవరి 27ను సర్ థామస్ అల్వా ఎడిసన్ జయంతిగా ఎలక్ట్రికల్ డేగా గుర్తించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పవర్ అల్తాఫ్ ,రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పాలు రాజ్, కార్యదర్శి మాదన్న, గౌరవాధ్యక్షుడు వై.శుక్రరావు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు షేక్ అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి



అజయ్‌కుమార్ మృతదేహం

చిన్నమండెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై కస్తూర్బా స్కూల్ దగ్గర ఆపి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రాయచోటి మండలం ఏజీ గార్డెన్ నివాసి అజయ్‌కుమార్ (19) ఆదివారం బైక్‌పై గుర్రంకొండ నుంచి రాయచోటి వైపు వస్తూ కస్తూర్బా స్కూల్ వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆరుగురు బైకర్ల అరెస్టు



స్వాధీనం చేసుకున్న బైకులతో ఎస్ఐ తిరుపాల్‌నాయక్

వేంపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో బైపాస్‌రోడ్డులో అధిక వేగంతోను, ఒకే చక్రంపై, పెద శబ్దాలను చేస్తూ బైకు నడిపిన ఆరుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరసింహులు, ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. రెండు రోజు లుగా బైపాస్ రోడ్డులో యువకు లు హల్‌చల్ చేసిన విషయం పోలీసుల దృష్టికి రావడంతో మూడు బైకులు స్వాధీనం చేసుకొని యువకు లను అరెస్టు చేసినట్లు తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలిగించేలా ద్విచక్ర వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కూలిన మట్టి మిద్దె



కూలిన మట్టిమిద్దె పైకప్పు

వేంపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం జెండా మాను వీధిలో మాబుఖాతున్ అనే మహిళకు చెందిన మట్టిమిద్దె కూలి పో యింది. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు నాని పోయిన మట్టి మిద్దె శనివారం రాత్రిఉన్నట్లుండి కూలిపోయింది. అయితే ఇంట్లో ఎవరు లేక పోవడంతో ఇంట్లోని వస్తువులు మాత్రమే దెబ్బ తిన్నాయి. సుమారు రూ. 50 వేలు నష్టం జరిగినట్లు బాధితురాలు తెలిపారు. ప్రభుత్వం పక్కాగృహం మంజూరు చేయించాలని కోరారు.

గుంజనేరు పరివాహక ప్రాంతాల్లో తుఫాను భయం!

● ప్రతి ఏటా కూలుతున్న ఇళ్లు ● రక్షణగోడ నిర్మించాలని డిమాండ్



గుంజనేరులో ప్రవహిస్తున్న నీరు

రైల్వేకోడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వస్తోందంటే చాలు గుంజనేరు, ముష్టేరు, మేకలగుంతేరు, గుండాలేరు పరివాహక ప్రాంతాల్లోని ప్రజల్లో ఆందోళన మొదలవుతుంది. తుఫాన్ హెచ్చరికలతో ఇప్పటికే భయం మొదలైంది. రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని నరసరాంపేట, ధర్మాపురం, చిన్నలాలాపేట, గాండ్లవీధి తదితర ప్రాంతాల్లోని నదీ తీరాల్లో ఎన్నో ఏళ్లుగా పేదలు ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు నరసరాంపేటలోని నదీ తీరంలో ఉన్న సుమారు పది ఇళ్లు కూలిపోయాయి. ఈ ప్రాంతంలో నది నుంచి రక్షణకు గోడ నిర్మించాలని ప్రజలు పదే, పదే విన్నవిస్తుండడంతో, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రక్షణ గోడ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అయితే, నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మళ్లీ టెండర్లు పిలిచి ఆ పనులను ప్రారంభించింది. అంతలోనే భారీ వర్షాలకు కురవడంతో పనులు ఆగిపోయాయి. ఇక ధర్మాపురం, చిన్నలాలాపేట, గాండ్లవీధి గ్రామాల్లో నదీతీరంలో సుమారు 300 పేద కుటుంబాలు నివసిస్తున్నాయి. భారీ వర్షాలు కురిసినపుడు అధికారులు ఆయాల ప్రాంతాల ప్రజలను అధికారులు స్థానిక హెచ్ఎంఎం హైస్కూలు, నారాయణ స్కూలు, గౌరీశంకర్ స్కూలు తదితర ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడికి తరలిస్తుంటారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వరద ఉధృతి ఎక్కువైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నట్లు రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ తెలిపారు. ప్రజలు చెరువుల వద్దకు కూడా ప్రజలు వెళ్లవద్దని అధికారులు సూచించారు. చిన్న పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని హెచ్చరించారు.



నరసరాంపేటలో నదీపరివాహక ప్రాంతంలో పేదల ఇళ్లు



గాండ్లవీధి ప్రాంతంలో ప్రవాహం పక్కనే పేదల ఇళ్లు

పేదలకు రక్షణ లేదు



ప్రతి ఏటా ఇళ్లు కూలిపోతున్నాయి. వాటిని కట్టించేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో కూలిపోయిన ఇళ్లలోనే బతుకుతున్నారు. రక్షణ గోడ నిర్మించి ఉంటే మేలు జరిగేది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని రక్షణగోడ పనులు పూర్తి చేయాలి.

- లింగాల యానాదయ్య, నరసరాంపేట

ఇళ్లు ఖాళీ చేయాల్సిందే..



భారీ వర్షాలు వస్తాయంటే ఇళ్లు ఖాళీ చేసి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. వరద తగ్గిన తర్వాత ఇళ్లు శుభ్రం చేసుకుని అందులోనే నివాసముంటున్నాం. మా గోడు ఎవరూ విని పించుకోవడం లేదు. ఇంటి స్థలాలతో పాటు, పక్కా ఇళ్లను మంజూరు చేయాలని గతంలో విన్నవించాం

- చింతల వెంకటరమణ, నరసరాంపేట

చెరువుల పరిశీలన

● మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు



యర్రబల్లె చెరువును పరిశీలిస్తున్న ఆర్డీఓ చిన్నయ్య

పులివెందుల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య చెరువులను, కుంటలను పరిశీలించారు. ఆదివారం పులివెందుల మండలంలోని యర్రబల్లె చెరువును పరిశీలించారు. తుఫాన్ ప్రభావం పెరిగితే ప్రజలకు పునరావాసం కల్పించేందుకు పులివెందులలోని న్యాక్ భవనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో ఎవరూ ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ కడప జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించారన్నారు. మట్టిమిద్దెలు, పెద పెద్దచెట్ల కింద, వాగులు,వంకలు, నదులు, చెరువులకు దిగువన నివాసం ఉండరాదన్నారు. గండి క్షేత్రం ఎదురుగా ఉన్న పాపాఘ్ని నదిలోకి భక్తులు వెళ్లరాదన్నారు. ,లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణుల విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పైడిపాళెం, సర్వరాయసాగర్ తదితర ప్రాజెక్టుల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైన సమస్య ఉత్పన్నమైతే మరమ్మతులు చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలంలో తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే లింగాల మండలంలో జూనియర్ అసిస్టెంట్ సతీష్ మొబైల్ నెంబర్ (9493778390), వీఆర్వో నాగార్జున (77990770084), పులివెందుల వాసులు ఆర్ఐ షెక్షావలి (995177271) వీఆర్వో శ్రీనివాసరెడ్డి (8978811567), చక్రాయపేట మండల వాసులు ఆర్ఐ గురుబాబు (798909766), వీఆర్వో మధుసూధన్‌రెడ్డి (9849722607), వేములవాసులు ఏఎస్ఓ మల్లికార్జున (8328289319), వీఆర్వో ఎర్రస్వామి (820082425), సింహాద్రిపురం మండల ప్రజలు వీఆర్వో నిరంజన్‌కుమార్ (6302545306), ఆపరేటర్ మల్లిక్ (8328509819), తొండూరు మండలవాసులు సీనియర్ అసిస్టెంట్ కుమారి (7569150977), వీఆర్వో ప్రభాకర్‌రెడ్డి (8328505068), వేంపల్లె మండల ప్రజలు వీఆర్వో ఓబయ్య (99590706523), వీఆర్వో రవీంద్రనాథ్ రెడ్డి (9703739557), వీరపునాయునిపల్లెలో ఎలక్షన్ ఆపరేటర్ బాష (9160709639), వీఆర్వో దొరబాబు (7702553857)కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. పులివెందుల ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ చిన్నయ్య (9849904111), రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగేంద్ర (8919134718) నెంబర్లలో 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 24 గంటలూ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

నిండు కుండలా ఝరికోన

● ప్రాజెక్టుకు చేరుతున్న 50 క్యూసెక్కుల వరద నీరు

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఝరికోన ప్రాజెక్టు ఇటీవల కురిసిన వర్షాలకు నిండుకుండను తలపిస్తోంది. ప్రాజెక్టులోకి 50 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని, అలుగు పారుతుండడంతో 50 క్యూసెక్కుల నీరు దిగువ ప్రాంతానికి వెళుతున్నట్లు తెలియజేశారు. బాహుదా నది పైభాగంలో వర్షాలు బాగా కురవడంతో వర్షపు నీరు ఝరికోన ప్రాజెక్టుకు చేరుతోంది. సంబేపల్లె, సుండుపల్లె, కేవీ పల్లి మండల రైతుల జీవన సాగునీటి ప్రాజెక్టు ఝరికోన. బాహుదా నదిపై 0.5 టీఎంసీల సామర్థ్యంతో 2008-09లో ఝరికోన ప్రాజెక్టును సంబేపల్లె మండలం వల్లబండపల్లి సమీప ప్రాంతంలో నిర్మించారు. ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నా ఒక ఎకరాకు కూడా సాగునీటి సౌకర్యం కల్పించలేదు. కేవీపల్లి, కలకడ, పీలేరు ప్రాంతాల్లో గ్రావిటీ ద్వారా తాగునీటిని మాత్రం వినియోగించుకుంటున్నారు. మూడు మండలాల రైతులకు సాగునీరు సంబేపల్లె, చిన్నమండెం మండలాలకు తాగునీరే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. కానీ అది మాత్రం నెరవేరలేదు. ఇప్పటికైనా ప్రాజెక్టు ఆశయం నెరవేరేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



ప్రాజెక్టు నిండి అలుగు పారుతున్న దృశ్యం

తెలుగుబిడ్డల ఆరాధ్యుడు ఎన్టీఆర్





ఎన్టీఆర్‌విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు సుధాకర్‌యాదవ్, గల్లా మాధవి

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తెలుగు బిడ్డల ఆరాధ్య దైవం స్వర్గీయ డాక్టర్ నందమూరి తారకరామారావు అని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధా కర్‌యాదవ్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మాధవిఅన్నారు. ఆదివారం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాకతీయ కమ్మవారి అన్నదాన సత్రంలో డాక్టర్ నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు ప్రజల కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించి బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడు తూ ప్రసాద పథకం కింద దేవస్థానం అభివృద్ధికి రూ.150 కోట్లు డీపీఆర్‌ను కేంద్రానికి పంపించడం జరిగిందన్నారు. రాబోవు నాలుగైదు సంవత్సరాల్లో బిమఠం మండల రూపు రేఖలు మారనున్నాయన్నారు. ముఖ్యంగా కాలజ్ఞాన కర్త శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. దేవస్థా నం పరిధిలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం పట్ల కాకతీయ కమ్మవారి అన్నదానసత్ర కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు 1984 సంవత్సరం లో ఏర్పాటు చేయడయం జరిగిం దన్నారు. అనం తరం కమి టీ సభ్యులు గుంటూరు ఎమ్మెల్యే గల్లా మాధవీ, ఎమ్మెల్యే పుట్టాను శాలువా పూలమాలలతో కమిటి సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్ర మంలో టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఎల్లటూరు సాంబశివారెడ్డి, టీడీపీ యువ నాయకుడు కాణాల మల్లిఖార్జునరెడ్డి, కమిటీ సభ్యులు చేరెడ్డి గద్దె కాశయ్య, చేరెడ్డి పేర య్య, గాలి పాపారావు, ఎల్ఐసీ అంజిబాబు, అంజ య్య రమణయ్య, వెంకటేశ్వర్లు, కేశవరావు, పుల్లారా వుతో పాటు కమిటీ సభ్యులు, కమ్మ సంఘం కుటుం బ సభ్యులు పాల్గొన్నారు.

ఉధృతంగా బాహుదా నది ప్రవాహం

● పలు గ్రామాలకు రాకపోకలు బంద్



ఉధృతంగా ప్రవహిస్తున్న బాహుదా నది

కలకడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బాహుదా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కలకడ నుంచి పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. మండలంతో సహా కలికిరి, కేవీపల్లి పరిధిలో ఉన్న బాహుదా నది ఉధృతంగా ప్రవహి స్తోంది. అధికారుల ఆదేశాలతో పాపిరెడ్డిగారిపల్లి-మహల్, కలకడ-తువ్వపల్లితో పలు నది ప్రవహిస్తున్న మార్గాలను ముందు జాగ్రత్త చర్యగా రెవెన్యూ అధికారులు మూసివేశారు. ప్రజలు గ్రామాలకు చేరుకునేందుకు ప్రత్యామ్నాయ రోడ్ల ద్వారా ప్రయాణం సాగిస్తున్నారు. రైతులు పొలాల వద్దకు చేరుకోవడానికి, పాడి రైతులు పశుగ్రాసం కోసం అవస్థలు పడుతున్నారు.

పాపాఘ్ని నదిలోకి వెళ్లొద్దు : డీఎస్పీ



పాపాఘ్ని నదిలో జెండాలు పాతి హెచ్చరిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

వేంపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్, భారీ వర్షాల నేపథ్యంలో పాపాఘ్ని నదిలోకి ఎవరూ వెళ్లవద్దని పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ హెచ్చ రించారు. వేంపల్లె పాపాఘ్ని నది వద్ద ఉన్న పలు రహదారు ల్లో ఎర్రజెండాలను పాతించారు. పాపాఘ్ని నదిలోకి వెళ్లవద్దని బ్యానర్లు ఏర్పాటు చేశారు. గుంతలు ఉన్నాయి పెద్దలు,పిల్లలు ఎవరు వెళ్లిన ప్రమాదం జరుగుతుందని డీఎస్పీ హెచ్చరించారు. సీఐ నరసింహులు, ఎస్ఐ తిరుపాల్ నాయక్ ఉన్నారు.

ప్రాజెక్టు వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలి



బాహుదా ప్రాజెక్టును పరిశీలిస్తున్న డీఎస్పీ మహేంద్ర, తదితరులు

నిమ్మనపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ కారణంగా మూడురోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలతో ఆదివారం డీఎస్పీ మహేంద్ర మండలంలోని బాహుదా ప్రాజెక్టు, నిమ్మనపల్లి పంచాయతీలోని అహోబిలనాయుని చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీపంలోని ప్రాజెక్టు చెరువులు, కుంటల వద్దకు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా భద్రతను కట్టుదిట్టం చేయాలని, అలాగే ప్రతి చేరువు వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేసి భారీ వర్షాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాల్లో ఆస్తి. ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ప్రాజెక్టు పర్యాటకుల సందడి ఎక్కువగా వుండడంతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే అహోబిలనాయని చెరువు వద్దకు వర్షాలు తగ్గేవరకు భక్తులు వెళ్లరాదని సూచించారు. కార్యక్రమలో ఇరిగేషన్ డీఈ దయానంద్ ప్రసాద్, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ తిప్పేస్వామి, సాగునీటి సంఘం అధ్యక్షుడు దేవేంద్ర, రాజన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

బాహుదా ప్రాజక్టుకు పూజలు

మండలంలోని ముష్టూరు పంచాయతీలో వున్న బాహుదా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో ఆదివారం వలసపల్లి, యర్రప్పగారిపల్లి గ్రామస్థులు చాముండేశ్వరమ్మ ఆలయంలో, బాహుదా గేట్ల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పూజలు నిర్వహించే సమయంలో ఇరిగేషన్ డీఈ దయానంద్ ప్రసాద్ ఉన్నతాధికారుల ఆదేశాలతో బాహుదా ప్రాజెక్టు గేట్లను ఎత్తి ఐదు నిముషాల పాటు నీటిని కిందకు విడుదల చేశారు. ఈ సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

బస్సుయాత్రను విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయకూడదని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నవంబర్ 6వ తేదీన నిర్వహించే బస్సుయాత్రను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి మాధవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆర్‌సీ వడ్డిపల్లెలో బస్సుయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో మార్చడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. మదనపల్లెలో బాలుర జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులను ప్రవేశపెట్టాలని, పీజీ విద్యను దూరం చేస్తున్న జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు లోకేశ్, నాగబాబు, సోము, యోగేశ్, భరత్, దినేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి


మదనపల్లె అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మౌలిక సమస్యల పరిష్కారం కోసం, కార్మికులు హక్కుల కోసం పోరాటాలు చేసిన సంఘం ఏఐటీయూసీ అని, ఈనెల 31న జెండావిష్కరణ, సభలు నిర్వహించాలన్నారు. కార్మికుల ఓట్లతో గద్దెనెక్కిన ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ముబారక్, తిరుమల, దేవా, చంద్ర, చిన్నప్ప, భువనేశ్వరీ, కృష్ణవేణి, ఉమా, రెడ్డెప్ప, యశోద, తదితరులు పాల్గొన్నారు.

కలికిరి పెద్ద చెరువుకూ పొంచి వున్న ప్రమాదం

● మహల్-కదిరాయచెరువు రోడ్డుపై భద్రత ప్రశ్నార్థకమే..?



నెర్రెలు బారిన కలికిరి పెద్దచెరువు కట్ట



మహల్ వద్ద బాహుదానదిపై ప్రమాదకరంగా ఉన్న రహదారి

కలికిరి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు ప్రధానమైన చెరువుల్లో బయ్యపురెడ్డి చెరువు ప్రమాదం బారి నుంచి తాత్కాలికంగా బయటపడినా దానికన్న పెద్దదయిన పట్టణంలో వున్న కలికిరి పెద్ద చెరువుకు కూడా ప్రమాదం పొంచి వున్నట్లు ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెల్లడైంది. కలికిరి-చదుం రోడ్డు ఈ చెరువు కట్టమీదే వెళుతుంది. చెరువు కట్ట మీద ఆంజనేయస్వామి ఆలయానికి సమీపంలో కట్ట మధ్యలో పది అడుగుల పొడవునా నెర్రెలు బారింది. ఇక్కడే చెరువుకు మధ్యలో వున్న తూమును లీకేజీ కారణంగా గతంలోనే పూడ్చివేశారు. దీని కారణంగానే తూము సమీపంలో కట్ట నెర్రెలు రోజు రోజుకూ పెద్దవవుతుండటం ఆందోళన కలిగిస్తోందని స్థానికులు చెబుతున్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయానికి కేవలం కూతవేటు దూరంలోనే ఉన్నా ఇప్పటికీ అధికారులు గుర్తించకపోవడం గమనార్హం. ప్రస్తుతం పెద్దచెరువులో సగం మాత్రమే నీరుంది. ఇప్పుడిప్పుడే పైనుంచి చెరువులోకి వంకలు సాగుతున్నాయి. తుఫాను వర్షాలకు చెరువు నిండితే వత్తిడి పెరిగి నెర్రెలు పడ్డ చోట కట్ట చెరువు లోపలికి కుంగిపోవడం సులభంగా జరుగుతుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ఇంజనీర్లు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు. అంతేగాకుండా ఇసుక టిప్పర్లలాంటి భారీ వాహనాలు చెరువు కట్టమీ వెళ్ళకుండా చూడాలని కోరుతున్నారు. కాగా మహల్ నుంచి కదిరాయచెరువుకు వెళ్లే రహదారి బాహుదా నది వద్ద పూర్తిగా ఛిద్రమైపోయింది. గత నెలలో బాహుదా నది ఉధృతంగా ప్రవహించడంతో నదికి అడ్డంగా తాత్కాలికంగా నిర్మించిన కాజ్‌వే ధ్వంసమైంది. ప్రస్తుతం బాహుదానదిపై వున్న నిమ్మనపల్లె ప్రాజెక్టు నిండిపోవడంతో ఏ క్షణమయినా గేట్లు ఎత్తడానికి సిద్ధంగా వున్నారని, కాబట్టి నదీ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఆదివారం పోలీసులు ప్రచారం చేశారు. ఇదే జరిగితే ప్రవాహ ఉధృతికి బాహుదాపై వున్న ఈ రహదారి కొట్టుకుపోవడం ఖాయమని, మహల్ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అటు వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఇక కలికిరి పట్టణం నడిబొడ్డులోని అమరనాథ రెడ్డి కాలనీ రెండవ వీధి రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు కాలువలు పొర్లి అర్ధరాత్రి ఇళ్ళలోకి నీళ్లు జొరబడ్డాయి. వెంటనే స్థానిక పంచాయతీ అధికార్లు ప్రొక్లైనర్లు ఉపయోగించి నీటిని మళ్ళించి ఉపశమనం కలిగించారు. అయితే తుఫాను వర్షాలు ఎక్కువగా పడితే నగ్రావాండ్లపల్లె వైపు నుంచి ప్రవహించే కాలువ ప్రమాదంలో పడుతుందని దీంతో పరిసరాల్లోని వేలాది ఇళ్ల ముంపునకు గురయ్యే అవకాశముందని చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి మధ్యలో వెళ్లే ఈ కాలువలో పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

15 పునరావాస కేంద్రాల ఏర్పాటు

పీలేరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో పీలేరు మండలంలో 15 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు శివకుమార్ ఆదివారం తెలిపారు. మండలంలోని ప్రతి పంచాయతీలో ఉన్న ఒక పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఆయా పంచాయతీల సిబ్బందికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. అంతే కాకుండా విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేందుకు జేసీబీలు, ట్రాక్టర్లు, ఇసుక బస్తాలు సిద్ధం చేసినట్లు ఆయన వివరించారు. అదే విధంగా కేవీపల్లె మండలంలో 5, కలకడలో 1, గుర్రంకొండలో 1 కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మదనపల్లె అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ఈనెల చివరి వరకు భారీ వర్షాలు ఉన్నట్లు వాతావరణ కేంద్రం హెచ్చరించిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు లోతట్టు ప్రాంతాల్లో ఉండరాదని, చెరువులు, వంకలు, వాగుల వద్దకు వెళ్లరాదని, అత్యవసరం ఉంటేనే తప్ప ప్రజలు ఇళ్ల నుం బయటకు రావద్దన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని, ఏమైనా సమస్యలు ఉంటే 9121501504నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ శ్రావణి, ఇరిగేషన్ ఏఈ బాబు రాజేంద్ర బాబు, ఫైర్ మెన్ బాబయ్య, ఏపీడీసీఎల్ ఏఈ అజయ్‌బాబు, తాలుకా ఎస్ఐ చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

● రాష్ట్ర అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్



ఐక్యత చాటుతున్న గిరిజనప్రజా సమాఖ్య సంఘం నాయకులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని గిరిజన ప్రజాసమాఖ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. గిరిజనులను చైతన్యపరచడానికి గిరిజన ప్రజా సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక మదనపల్లె టౌన్ హాల్‌లో గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మైదాన ప్రాంతాల గిరిజనులు దుర్భర జీవితం గడుపుతున్నారని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించకపోవడంతో అన్ని విధాల నష్టపోతున్నారన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉన్నత వర్గాల నాయకులు ఓట్ల కోసమే తమను వాడుకుంటున్నారని వాపోయారు. ఇప్పటికే రాష్ట్రంలో అనేక చోట్ల ప్రజాచైతన్య కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గిరిజనులు ఐక్యంగా తమ హక్కులను సాధించాలన్నారు. కార్యక్రమంలో రాజానాయక్, నాగరాణి, రవినాయక్, హనుమంతునాయక్, సైయదా నాయక్, రంగా నాయక్, ప్రసాద్ నాయక్, దుర్గా నాయక్, ఆనంద్, మంగే నాయక్, మల్లు స్వామి నాయక్, రవీంద్రనాయక్, లక్ష్మీనాయక్, అల్ ఇండయా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నాగునాయక్, కార్యదర్శి శంకర్‌నాయక్, మనోజ్‌కుమార్ నాయక్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలను సచివాలయ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు బేఖాతర్ చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రానున్న మూడు రోజులు తుఫాన్ కారణంగా అప్రమత్తంగా ఉండాలని, సచివాలయ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు ఆయా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేవాలు జారీ చేశారు. అయితే మండలంలోని ఏ సచివాలయంలో కూడా సచివాలయ సిబ్బంది అందుబాటులో లేకకపోవడం గమనార్హం. రానున్న తుఫాన్ కారణంగా గ్రామాల్లో రైతులు భయాందోళన చెందుతున్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు తుఫాన్ హెచ్చిరికలు జారీ చేయాలని అధికారులు ఆదేశించినా సచివాలయ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): 2025 డీఎస్సీలో ఉద్యోగం సాధించిన నూతన ఉపాధ్యాయులకు ఆదివారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చాక డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు ఇచ్చి మాట నిలబెట్టుకున్నారన్నారు. అనంతరం 150 మంది నూతన ఉపాధ్యాయులను దుశ్శాలువాలు, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, హెచ్ఎం సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడికి సన్మానం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): హౌస్‌బిల్డింగ్ సొసైటీ నూతన అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎంపికైన ఎస్.రెడ్డి షంషీర్, రెడ్డెప్ప, బి.మహేష్‌కుమార్‌లను ఆదివారం టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రెడ్డి షంషీర్ మాట్లాడుతూ హౌస్ బిల్డింగ్ సొసైటీ ద్వారా ప్రజలను సౌకర్యవంతమైన బిల్డింగ్ నిర్మాణాలకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు వీరవెంకట శివాజీ, వెంకటాచలపతి, నరేశ్, శివానంద నాయక్, టీడీపీ నాయకులు శివన్న, శ్రీనివాసులు, హరి, మధు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



మండల పరిషత్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద ప్రమాదకరంగా ఉన్న ఎండిన వృక్షం

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రం మండలపరిషత్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద ఓ వృక్షం ఎండిపోయి ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితిలో ప్రమాదకరంగా ఉంది. నిత్యం మండలపరిషత్ కార్యాలయానికి వచ్చేవారు, పీటీఎం, రంగసముద్రం మార్గంలో వెళ్లే ద్విచక్రవాహనదారులు, పొలాలకు వెళ్లే రైతులు ఈ మార్గం గుండా వెళ్తాంటారు. ఎండిపోయిన వృక్షం పక్కనే విద్యుత్ లైన్ కూడా ఉంది. ఆ వృక్షం విద్యుత్ లైన్‌పై పడితే తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగక ముందే ఎండిపోయిన వృక్షాన్ని తొలగిస్తే మంచిదని అభిప్రాయపడుతున్నారు. అధికారులు స్పందించి ఎండిన వృక్షాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏ నిమిషం ఏ ప్రమాదమో..

వాల్మీకిపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎండిన ఓ మహావృక్షం ప్రమాదకరంగా తయారైంది. మండలంలోని మంచూరు గ్రామ సమీపాన ఓ మద్ది వృక్షం పూర్తిగా ఎండిపోయి నేడో రేపో కూలిపోయే దశకు చేరుకుంది. ఈ ప్రాంతం గుండా గ్రామానికి విద్యుత్ సరఫరా స్తంభాలు ఉండడం ఏ నిమిషాన ఎండిపోయిన చెట్టు కూలితే నేరుగా విద్యుత్ లైన్లపైనే ప్రభావం చూపుతుందని, అదే సమయాన ఇబ్బందులు తప్పవని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన చెట్టును తొలగించాలని కోరుతున్నారు.



అదుపులోకి వచ్చిన బయ్యపురెడ్డి చెరువు ప్రమాదం



ఇసుక సంచులతో చెరువు గండిని నింపుతున్న దృశ్యం

కలికిరి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు అధికారుల కృషి ఫలించి బయ్యపురెడ్డి చెరువు ప్రమాదం నుంచి తాత్కాలికంగా గట్టున పడింది. జలవనరుల శాఖ అధికారులు ఇరవై నాలుగు గంటలపాటు శ్రమించడంతో చుట్టు పక్కల గ్రామస్థులకు ఊరట లభించింది. మండలంలో అతి పెద్ద రెండో చెరువైన గుండ్లూరు గ్రామంలోని బయ్యపురెడ్డి చెరువుకు గండిపడి ఆందోళన నెలకొన్న విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం నుంచే ఇంజినీర్లు డీఈఈ గోపీ కృష్ణ, ఏఈ శ్రీనివాసులు రెడ్డి, ఎంపీడీవో భాను మూర్తిరావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వీఆర్ఏలు గండిని పూడ్చే పనులను పర్యవేక్షించారు. యంత్రాలను ఉపయోగించి దాదాపు 500 ఇసుక సంచులు వేసి గండిని నిలువరించారు. ఆపైన గండికి మట్టి కప్పే ప్రయత్నం చేపట్టారు. ఆదివారం రాత్రికి ఈ పని పూర్తవుతుందని జలవనరుల శాఖ ఏఈ శ్రీనివాసులు రెడ్డి చెప్పారు. సోమవారం కూడా చెరువు కట్టను పటిష్టపరిచే చర్యలు కొనసాగిస్తామని అధికార్లు చెప్పారు.

రెడ్డెమ్మకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించి అనంతరం అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కర్ణాటక, తిరుపతి, కడప, చిత్తూరు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి చెంత వరపడ్డారు. అనంతరం మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏక్తా దౌడ్‌ను విజయవంతం చేయాలి

పీలేరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఈనెల 31న జరగనున్న ఏక్తా దౌడ్‌ను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్ తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ 127వ ఎపిసోడ్‌ను ఆదివారం ఆయన పీలేరులోని నారాయణ పాఠశాల విద్యార్థులతో కలిసి వీక్షించారు. అనంతరం ఆయన స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన ఆర్ఎస్ఆర్ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేశ్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, పీలేరు నియోజకవర్గ కన్వీనర్లు పొత్తూరి శ్రీకాంత్, వెంకటరమణ, నాయకులు రామాంజులు, వెంకటాద్రి, తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ లో వాకింగ్ ట్రాక్ నిర్మాణం

బి.కొత్తకోట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల ఆకర్షణ కోసం పూర్వ కలెక్టర్ చామకూరి శ్రీధర్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. మదనపల్లి సబ్‌కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరించే హార్సిలీహిల్స్ టౌన్‌షిప్‌కమిటీ నిధులు, పీకేయం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులతో ముఖద్వారం, హిల్స్‌లోని ప్రధాన కూడళ్లు, గాలిబండ తదితర ప్రాంతాలలో ఆకర్షణీయమైన నిర్మాణాలు చేపట్టారు. వాటి నిర్మాణం కూడా దాదాపు పూర్తి చేశారు. అదేవిధంగా హరితసర్కిల్ నుంచి ఏనుగుమల్లమ్మ గుడి, జిడ్డుక్రిష్ణమూర్తి సర్కిల్, పోలీస్ గెస్టుహౌస్, వీఎస్ఆర్ సర్కిల్, గాలిబండలను చుడుతూ వాకింగ్‌ట్రాక్ నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టారు. అప్పటి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ బదిలీ కావడంతో ఈ పనులు కూడా వాయిదా పడ్డాయి. కొంత గ్యాప్ తర్వాత మళ్లీ వాకింగ్‌ట్రాక్ పనులు మొదలయ్యాయి. ఇది పూర్తి అయితే పర్యాటకులు సంధ్యా సమయంలో పొగమంచులో సరదాగా కొండనంతటినీ చుడుతూ కాలినడకన సేదతీరే వెసులుబాటు కలగనుంది. పనులు ఎపుడు పూర్తి అవుతాయా? అని పర్యాటకులు ఎదురు చూస్తున్నారు.



హార్సిలీహిల్స్‌లో నిర్మాణంలో ఉన్న వాకింగ్‌ట్రాక్